andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 । కనిష్ఠం 19.2
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని మంత్రికి వినతి

ఉట్నూర్, ఫిబ్రవరి1: వైద్యఆరోగ్యశాఖలో జీవో68 అమలు చేస్తూ ప్రత్యేక ఉద్యోగ నోటిఫికేషన్ వేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఏజెన్సీ ఆదివాసీ యూత్ ఫోరం అధ్యక్షుడు గేడం నిరంజన్ తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే జీవో68 వచ్చిందని, ఆ తర్వాత ఈ జీవోను ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక పోస్టులు కేటాయించాలని శిక్షణ పూర్తి చేసిన స్టాఫ్‌నర్సు ఉద్యోగాలివ్వాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేశవరావు ఉన్నారు.

- తొలిసారిగా సీఎం హోదాలో జిల్లాకు రానున్న రేవంత్‌రెడ్డి
- కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు
- మరో రెండు గ్యారెంటీలను ప్రకటించే అవకాశం
- ఇంద్రవెల్లి నుంచే పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- ఆదివాసీల సమస్యలు.. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- భారీ జన సమీకరణకు కాంగ్రెస్ నేతల కసరత్తు
- బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి.. ఏజెన్సీలో గట్టి బందోబస్తు



చలో ఇంద్రవెల్లి!



ఆదిలాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) / ఇంద్రవెల్లి: సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అక్కడే ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి ఇంద్రవెల్లిలోనే దళిత గిరిజన దండు పేరిటా బహిరంగసభను నిర్వహించారు. ఈసభ సక్సెస్ కావడం కాంగ్రెస్ పార్టీకి ఎంతగానో కలిసి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజే ఇం ద్రవెల్లి అమరవీరుల స్మృతివనం నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు బాధ్యతలు అప్పగించడంతో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గతరెండురోజులుగా దగ్గరుండి పరిశీలిస్తున్నారు. 'చలో ఇంద్రవెల్లి' పేరిటా సీఎం బహిరంగ సభకు భారీ జనసమీకరణకు కసరత్తు చేస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీగౌస్‌ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జీ పీవో ఖుష్బుగుప్తా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

మరో రెండు గ్యారెంటీలు

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యంతోపాటు రాజీవ్‌ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఇంద్రవెల్లి నుంచే మరోరెండు గ్యారెంటీలకు శ్రీకారం చుట్టే అవకాశం కన్పిస్తోంది. ఇందులో రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరాపై స్పష్టమై న ప్రకటన చేసే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వా రా తెలుస్తోంది. దశల వారీగా ఆరుగ్యారెంటీల అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గతంలో ఇచ్చిన హామీమేరకు సీఎం రేవంత్‌రెడ్డి సొంతంగా రూ.15లక్షల నిధులతో కేస్లాపూర్ నాగోబా ఆలయ ప్రాంగణంలో నిర్మించిన మురాడి ఆలయాన్ని ప్రారంభించనున్నారు.

ఇంద్రవెల్లి సెంటిమెంట్

సీఎం రేవంత్ రెడ్డికి ఇంద్రవెల్లి సెంటిమెంట్ కావడంతో గతంలో తొలి సభను ఇక్కడే నిర్వహించారు. ఊహించని విధంగా సక్సెస్‌కావడంతో కాంగ్రెస్‌కు మంచి ఊపునిచ్చింది. అప్పటినుంచే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గ్రాఫ్ భారీగా పెరిగింది. త్వరలోజరుగనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని కూడా ఇంద్రవెల్లి నుంచే శ్రీకారం చుట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దీనికి అనుగుణంగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం సాధించేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో రెండు స్థానాలలో ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థులు మూడో స్థానంతోనే సరిపెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీలోకి వలసలు భారీగా పెరుగుతున్నాయి. బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి నేతలు భారీగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. జిల్లాలో పార్టీ మరింత బలపడడంతో పార్లమెంట్ స్థానాన్ని తన ఖాతాల్లో వేసుకునేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తుంది.

సమస్యల పరిష్కారానికి ఆదివాసీల పట్టు

ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితానుంచి తొలగించాలని పట్టుబడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 11 గిరిజన ఉప కులాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీ తీర్మానాన్ని చేయడాన్ని తప్పుబడుతున్నారు. వెంటనే ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతున్నారు. అలాగే మిగిలిన పోడు భూములకు ఎటువంటి షరతులు లేకుండా హక్కుపత్రాలు ఇవ్వాలని ఆదివాసీ నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. పీసా, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలుచేసి ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీని నిర్వహించి ఉద్యోగ నియమకాలు చేపట్టాలని, రాంజీ గోండు కొమురం భీం, భీర్సాముండా స్మృతి వనాలను ఏర్పాటు చేసి ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు తాగునీటి సౌకర్యంతోపాటు విద్యుత్, రవాణా సౌకర్యాన్ని కల్పించాలని ముఖ్యమంత్రిని కోరనున్నారు. అలాగే జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన కోర్టా- చనకా బ్యారేజి నిర్మాణం పనులను పూర్తిచేసి 50వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని జిల్లావాసులు కోరుతున్నారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి కుప్టిప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

టార్గెట్ లక్ష జనాభా

సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా జిల్లా పర్యటన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ జనసమీకరణకు కసరత్తు చేస్తున్నారు. లక్ష జనాభాను బహిరంగ సభకు తరలించే ందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 25వేల మందిని తరలించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జీలు పకడ్బందీగా ప్లాన్‌చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క జిల్లా నేతలతో సన్నాహక సమావేశాలను నిర్వహించి దిశానిర్ధేశం కూడా చేశారు.

• సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి నేరుగా ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేస్తారు. అక్కడే గిరిజన దర్బార్ సభా వేదికలో స్వయం సహాయక సంఘాల సభ్యులు జిల్లాస్థాయి అధికారులు, ప్రజా ప్ర తినిధులతో సమావేశమవుతారు. అక్కడినుంచి ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద చేపట్టిన స్మృతివనానికి భూమిపూజ చేస్తారు. అనంతరం అక్కడచేసిన బహిరంగ సభలో ప్రస ంగిస్తారు. అనంతరం సాయంత్రం 4.55కు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



అమరవీరుల స్థూపం వద్ద అధికారుల తనిఖీలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి1: సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి పర్యటనకు జిల్లాయంత్రాంగం అన్నిఏర్పాట్లను పూర్తి చేసింది. స్థానిక ఆదివాసీ అమరవీరులస్థూపం బహిరంగ సభ వేదికతోపాటు కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఏర్పాట్లను పూర్తిచేశారు. సభవేదిక రెండుచోట్ల ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, సభస్థలం ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, బారిగేట్ ఏర్పాట్లను పూర్తిచేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో కలిసి మంత్రి సీతక్క పరిశీలించారు.

• సీఎం ప్రత్యేక రక్షణ పోలీసు బృందం తనిఖీలు

కేస్లాపూర్ నాగోబా ఆలయంతోపాటు అమరవీరుల స్థూపం వద్ద సీఎం పర్యటన సందర్భంగా సీఎం ప్రత్యేక రక్షణ పోలీస్‌బృందం (ఐఎస్‌డబ్ల్యూ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. నాగోబా ఆలయ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ అమరవీరుల స్థూపం సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్, బహిరంగ సభాస్థలాన్ని పరిశీలించి లోకేషన్ ట్రాక్ చేసి ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఏర్పాట్లను ఎస్పీ గౌస్ ఆలం, ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తతో కలిసిపరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్ ముస్తాబు చేశారు.

ఢిల్లీలో బీఆర్ఎస్ మాజీ ఎంపీ మకాం!

బోథ్, ఫిబ్రవరి1: టీఆర్ఎస్ పార్టీలో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎంపీగా గెలుపొందిన మాజీ ఎంపీ జి.నగేష్ పార్టీ వీడనున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఇటీవల తన అనుచర వర్గంతో సమావేశమై పార్టీ ఫిరాయించే విషయమై అనుచర్ల మనోగతాన్ని తెలుసుకున్నట్లు తెలిసింది. అయితే ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరుతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే మాజీ ఎంపీకి భారతీయ జనతాపార్టీలో ఉన్న మంత్రులు ఎంపీలతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఆయన బీఆర్ఎస్ వీడి బీజేపీలో చేరనున్నట్లు అనుచరులు పేర్కొంటు న్నారు. కాగా మాజీ ఎంపీ మాత్రం కాంగ్రెస్‌లో చేరాలనన ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. అయితే బీజేపీకి చెందిన ఎమ్మెల్యే గురువారం ఉదయం ఢిల్లీలో బీజేపీ అధిష్ఠానంతో మాజీ ఎంపీతో చర్చించినట్లు తెలిసింది. ఏదేమైనా రెండు మూడు రోజుల్లో నగేష్ తన రాజకీయ భవితవ్యాన్ని ప్రకటించే ఆస్కారం ఉంది.

గొర్రెల పంపిణీ చేపట్టాలి

- ఆదిలాబాద్‌లో ధర్నా
- కార్యాలయానికి తాళం వేసి యాదవ సంఘం నిరసన



పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట యాదవ సంఘం ధర్నా



తాళం వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 1 : రెండోవిడత గొర్రెల పంపిణీ చేపట్టాలని యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం పశుసంవర్ధకశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డీడీలు చెల్లించి రెండేళ్లు కావస్తున్నా పంపిణీ మాత్రం చేయడం లేదంటూ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న జేడీ సుధాకర్ అక్కడి చేరుకుని వారితో మాట్లాడారు. డీడీలు చెల్లించిన వారికి యూనిట్లను మంజూరు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ప్రభుత్వంవద్ద ఈ విషయం పెండింగ్‌లో ఉందన్నారు. అక్క డి నుంచి సమాధానం వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు గణేష్ మాట్లాడుతూ ఏడాదిన్నర క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల కోసం డీడీలను చెల్లించామన్నారు. ఇప్పటివరకు తమకు యూనిట్లను కేటాయించ లేదన్నారు. అధికారుల చుట్టూ తిరినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందన్నారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించేలా నూతన కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేయాలని డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లికి వచ్చే సీఎం రేవంత్‌రెడ్డికి తమ సమస్యను విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘువీర్, హన్మండ్లుయాదవ్, గణేష్, ప్రఫుల్ యాదవ్, వేణుగోపాల్‌యాదవ్ తదతరులు పాల్గొన్నారు.

ముథోల్‌లో వారసంత కోసం షెడ్డు మంజూరు

ముథోల్, ఫిబ్రవరి 1 : ముథోల్‌లోని వారసంత అంగడి బజార్‌లో వ్యాపారం చేసే వారికి కూరగాయలు కొనేవారికి ఇబ్బందుల దృష్ట్యా సెంటర్‌ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నాబార్డ్ ఆర్థిక సహకారంతో ముథోల్‌లో గ్రామీణ సంత నిర్మాణానికి షెడ్డు మంజూరయ్యింది. గ్రామ పంచాయతీ అభ్యర్థిన మేరకు నాబార్డ్ నుంచి ఆమోదం లభించింది. గురువారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతుల మీదుగా సీఆర్డీ నిర్మల్ జిల్లా బాధ్యులు కిరణ్ కుమార్, పీవో రాజు రూరల్ మార్కెటింగ్ మంజూరు పత్రాన్ని ముథోల్ సర్పంచ్ రాజేందర్‌కి అందించారు. త్వరలో నిర్మాణ పనులను మొదలుపెట్టి మార్కెట్ షెడ్డుతో పాటు మరుగుదొడ్ల పార్కింగ్, ఇతరత్రా వసతులు ప్రజలకు మార్కెట్‌లో అందుబాటులోకి తేవడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జి తాటివార్ రమేష్, నాయకులు మోహన్ రెడ్డి, సప్పటోళ్ల పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

సదరం స్లాట్ బుకింగ్‌కు మూడు నెలలు కేటాయించండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 1 : సదరం స్లాట్ బుకింగ్ చేయడంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు మీ సేవ వీఎల్ఈ తెలిపారు. గురుఆరం డీఆర్డీవో విజయలక్ష్మిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నిర్మల్ జిల్లాలో 92 మీ సేవ కేంద్రాలున్నాయన్నారు. 300ల ప్రభుత్వ శాఖలపైగా సేలందిస్తున్నామన్నారు. సదరం స్లాట్ బుకింగ్ ఆటంకాలు జరుగకుండా ఉండాలంటే మూడు నెలలు సమయం కావాలన్నారు. మండల కేంద్రాల్లో మెగా ఓపెన్ సదరం శిబారాలు నిర్వహించాలని తద్వారా దరఖాస్తు చేసుకునేవారు సౌలభ్యం పొందుతారన్నారు. మీ సేవ నిర్వాహకుల సంఘ నాయకులు పవన్, తదితరులు పాల్గొన్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.1 ; కనిష్ఠం 20.3

నిర్మల్ జిల్లా వార్తలు

8

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024





కొంత మోదం మరికొంత ఖేదం

- కేంద్ర మధ్యంతర బడ్జెట్‌పై జిల్లా వాసుల భిన్నాభిప్రాయాలు
- ఉద్యోగ ఉపాధ్యాయుల అసంతృప్తి
- ఆదాయ పన్ను స్లాబుల్లో కనిపించని మార్పులు
- పంటల బీమాపై అన్నదాత ఆశలు
- అంగన్వాడీ, ఆశ కార్యకర్తలకు శుభవార్త
- పేదలకు ఇంటి నిర్మాణాలపై చిగురిస్తున్న ఆశలు
- జిల్లాలో రైల్వే లైన్ నిధులకు మొండిచేయి

నిర్మల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. కొంతమోదం... మరికొంత ఖేదంగా ఈ బడ్జెట్ ఉన్నట్లు ఆర్థిక నిపుణులు అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగవర్గాలకు బడ్జెట్ పెద్దగా ఊరటనివ్వలేదంటున్నారు. స్లాబురేట్లు యధావిధిగా ఉంటాయని ఆర్థికశాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగవర్గాలన్ని నిరాశకు గురయ్యాయి. ఎన్నికల వేళ కేంద్రప్రభుత్వం ఉద్యోగులపై వరాలజల్లు కురిపించిన వారందరికీ ఆశాభంగమే ఎదురైంది. ఉదయం నుంచి ఉద్యోగులు ఎంతో ఆతృతగా బడ్జెట్ కోసం ఎదురుచూశారు. ఇన్‌కంటాక్స్ ఈసారి తమకు తగ్గుతుందని భావించిన ఉద్యోగులకు నిరాశ ఎదురైంది. దీంతో వారంతా నిర్ఘాంతపోయారు. కాగా అన్నదాతలకు మాత్రం ఈ బడ్జెట్ కొంత ఊరటనిచ్చింది. ఎన్నికల సమయంలో రైతులపై వరాలజల్లు కురుస్తుందని భావించిన రైతులకు పూర్తిస్థాయిలో కాకుండా కొంత మేరకు మాత్రమే మేలు జరిగిందని అంటున్నారు. అయితే ముఖ్యంగా పంటబీమా కింద నాలుగు కోట్ల మంది రైతులకు ప్రయోజనం కల్పిస్తామంటూ కేంద్ర మంత్రి చేసిన ప్రకటన అన్నదాతలకు కొంత మేర భరోసా కల్పించింది. దేశవ్యాప్తంగా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామంటూ మంత్రి చేసిన ప్రకటన బడుగు బలహీన వర్గాలందరికీ తీపి కబురుకానుంది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామని హామీనిచ్చిన నేపథ్యంలో కేంద్రం 300 యూనిట్లను గరిష్టంగా పేర్కొనడం పట్ల పేదబడుగు వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలను ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి చేరుస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి ప్రకటించడంతో వారంతా సంబురపడుతున్నారు. త్వరలోనే కొత్త హౌసింగ్ స్కీం ప్రవేశపెడతామంటూ ప్రకటించడంతో మధ్య తరగతి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తామని ప్రకటించడంతో ఇళ్లు లేని నిరుపేదలు ఊరట చెందుతున్నారు. అలాగే మహిళ స్వయం సహాయక బృందాలకు కూడా పెద్దమొత్తంలో నిధులను కేటాయిస్తామని ప్రకటించడంతో మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగి వారంతా స్వయంసమృద్ధి సాధించే అడుగులు పడబోనున్నాయంటున్నారు.

జిల్లాలో మళ్లీ రైల్వేలైన్‌కు మొండిచేయి

కాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదిలాబాద్ - నిర్మల్ రైల్వేలైన్ సర్వేకు సంబంధించి ఎలాంటి నిధులు కేటాయించకపోవడం అలాగే బడ్జెట్‌లో కనీస ఊసులేకపోవడంతో జిల్లా ప్రజలంతా తీవ్రనిరాశకు గురయ్యారు. గత పదేళ్ల నుంచి రైల్వే లైన్ ఏర్పాటు కోసం జిల్లా ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రైల్వే సాధన సమితి పేరిట ఉద్యమం చేపట్టేందుకు కూడా సిద్ధమవుతున్నారు. అయితే గతంలో జిల్లా ఎంపీతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులంతా రైల్వేలైన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించడమే కాకుండా అన్ని రకాల ఒత్తిడిలు కూడా తీసుకువచ్చారు. దీంతో ప్రాథమిక స్థాయిలో సర్వే జరుపుతామన్న సంకేతాలు కూడా కేంద్ర ద్వారా వెలువడ్డాయి. ఈ సారి బడ్జెట్‌లో ఎలాగైనా రైల్వేలైన్‌కు సంబంధించి నిధులు కేటాయించబడతాయని అందరు ఆశించారు. బడ్జెట్‌లో మాత్రం ఎక్కడ కూడా రైల్వే లైన్ ఏర్పాటుకు సంబందించి ప్రస్తావన లేకపోవడం, నిధుల కేటాయింపుపై ఎలాంటి ప్రకటన జారీకాకపోవడంతో జిల్లా ప్రజలు నిరాశకు గుర్యాయ్యారు. దీనిపై ఆందోళనలు మరింత ఉధృతం చేసేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

ఉద్యోగ వర్గాల అసంతృప్తి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగ వర్గాలను తీవ్రనిరాశకు గురి చేసింది. ఆదాయపు పన్నుస్లాబుల్లో ఎలాంటి మార్పులు లేకుండా పాతస్లాబులనే యధావిధిగా కొనసాగించేట్లు బడ్జెట్‌లో పేర్కొన్న కారణంగా ఉద్యోగులు నిరాశకు లోనయ్యారు. కొద్ది రోజుల్లోనే లోక్‌సభ ఎన్నికలు జరగబోనున్న నేపథ్యంలో ఈ సారి ఉద్యోగులపై వరాల జల్లు కురవవచ్చని అందరు ఆశించారు. అయితే అందరి ఆశలను కేంద్రం తలకిందులు చేసిందంటూ ఉద్యోగ వర్గాలు విమర్శిస్తున్నాయి.

బడ్జెట్‌లో మార్పులేదు



కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్‌లో మార్పు ఏమి లేదు. టాక్స్‌స్లాబులలో ఎలాంటి కొత్తవి లేవు. చిన్న మొత్తాల్లో పన్ను చెల్లింపుదారులు సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయాలి. ఆదాయ పన్ను చెల్లింపు వివాదాలు ఈ కమిటీ ద్వారా పరిష్కారమవుతాయి. ఆధాయపు పన్ను ట్రిబ్యునల్ కూడా స్వల్ప మొత్తం పన్ను చెల్లింపుదారుల సమస్యల పరిష్కారానికి ఊరట కల్పించింది.

కూన ప్రదీప్, టాక్స్ కన్సల్టెంట్, నిర్మల్

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



తెలంగాణ రాష్ట్రానికి రైల్వేబడ్జెట్‌లో కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయి గత మూడు దశాబ్దాలకు పైగా ఆశలు పెట్టుకున్న ఆదిలాబాద్, ఆర్మూర్ రైలుమార్గం ఈ బడ్జెట్‌లో కూడా పెట్టకపోవడం జిల్లా ప్రజలను తీవ్రనిరాశకు గురి చేసింది. పారిశ్రామిక పరంగా తెలంగాణకు కేటాయింపులు లేవని తెలిపారు.

కొట్టె శేఖర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్

అన్ని వర్గాల వారికి అనుకూలం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల వారికి అనుకూలంగా ఉంది. దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం శ్రమిస్తూ అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రపంచదేశాల్లో భారత్‌ను బలీయమైన శక్తిగా తీర్చిదిద్దే దిశగా కేంద్రం చేస్తున్న మహాయజ్ఞానికి ఈ బడ్జెట్ మార్గం సుగమం చేస్తుంది.

అంజు కుమార్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



అమ్మవారి సన్నిధికి బోనాలతో వెళుతున్న మహిళలు

తానూర్‌లో ఘనంగా బోనాల పండుగ

తానూర్, ఫిబ్రవరి 1 : మండల కేంద్రమైన తానూర్‌లో గ్రామస్థులు ఘనంగా బోనాల పండగను గురువారం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామదేవతలయిన పోచమ్మ, మహాలక్ష్మీ అమ్మవారి దేవతమందిరాలను పూలతో అలంకరించారు. అమ్మవార్లకు పంచామృత అభిషేకాలతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించి మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పోతరాజులతో పాటు బాజాభజంత్రీలతో గ్రామంలోని మహిళలు మంగళహారులతో బోనాలను తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ గ్రామంలో పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు. ఈ బోనాల పండుగను తిలకించడానికి ఆయా గ్రామాల ఆడపడుచులతో పాటు అమ్మవారి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తిలకించారు. దీంతో గ్రామం మొత్తం పండుగ వాతావరణం కనిపించింది. గ్రామ కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పంగి పండరి ఉపాధ్యక్షులు రాములు, సర్పంచ్ తాడేవార్ విఠల్, మాజీ సర్పంచ్ మాధవ్‌రావుపాటిల్, పీఏసీఎస్ డైరెక్టర్ పుండ్లీక్, నాయకులు జాదవ్ గోవింద్‌పటేల్, సోమ్‌నాథ్, గ్రామ పెద్దలు, ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్థులు తదితరుల పాల్గొన్నారు.

చించాలలో ముగిసిన అఖండ హరినామ సప్తాహం



కాలకీర్తన చెబుతున్న నారాయణ మహారాజ్

ముథోల్, ఫిబ్రవరి 1 : మండలంలోని చించాల గ్రామంలో గల హనుమాన్ మందిరంలో గత వారం రోజుల నుండి కొనసాగుతున్న అఖండ హరి నామ సప్తాహం గురువారం నాటికి ముగిసింది. ముగింపు సందర్భంగా శ్రీ నారాయణ మహారాజ్ యాతల్‌కర్ కాలకీర్తన నిర్వహించారు. ప్రతి మానవుడు జీవిత గమనంలో ఆధ్యాత్మిక చింతనతోనే మానవజన్మ స్వార్థకమవుతుందన్నారు. భక్తిభావంతో జీవితం ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. అధికసంఖ్యలో మహిళలు, భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. మహారాజులను భజన మండలి సభ్యులను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సప్తాహం ముగింపు సందర్భంగా జాతర కొనసాగింది. జాతరకు వచ్చిన భక్తులకు గ్రామస్థులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సాగౌడ్, టి. రమేష్, కోరి పోతన్న, పోతన్న, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, గ్రామస్థులు, తదితరులున్నారు.



బాసరకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కీని నుంచి బాసరకు మహిళా భక్తుల పాదయాత్ర

ముథోల్, ఫిబ్రవరి 1 : మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ తాలూకా కీని గ్రామం నుండి బాసర అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు 80 మంది మహిళా భక్తులు కాలినడకన బయలుదేరారు. గురువారం రాత్రి ముథోల్‌లో బస చేసి శుక్రవారం ఉదయం బాసరకు చేరుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం గత ఐదు సంవత్సరాల నుంచి తాము తమ గ్రామం నుంచి బాసర వరకు కాలినడకన వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటున్నామని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో పాటు పాడి పంట సమృద్ధిగా ఉంటుందని పేర్కొన్నారు. నదిలో పుణ్యస్నానం ఆచరించి, సుమారు 60 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసి అమ్మవారిని దర్శించుకోవడం వలన అంతా సంతోషం కలుగుతుందన్నారు.

రోడ్డు భద్రత పాటిస్తే ప్రమాదాలు జరగవు : ఆర్టీవో



నిబంధనలు పాటిస్తున్న వారిని సన్మానిస్తున్న ఆర్టీవో, సీఐ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 1 : రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరుగవని నిర్మల్ ఆర్టీవో అజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్టీవో కార్యాలయం ఎదుట రోడ్డుభద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఫోర్‌వీలర్స్ నడిపే డ్రైవర్లు సీటుబెల్ట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నచోట అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించిన వారిని శాలువాతో సన్మానించి పువ్వులు అందజేశారు. పట్టణ సీఐ పురుషోత్తం పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయండి

- కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి గంగారెడ్డి

ముథోల్, ఫిబ్రవరి 1 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో శుక్రవారం జరిగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ముథోల్ కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి గంగారెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత మొట్టమొదటి సభ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లిలో పెట్టడం ద్వారా గిరిజన, బడుగు, బలహీన వర్గాలపై ఆయన చూపిస్తున్న ప్రేమ మర్చిపోలేనిదన్నారు. ఈ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

కుంటాల : నేడు ఇంద్రవెల్లిలో నిర్వహించబోయే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం చేకూరుతుందని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని ఆయన పేర్కొన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి : ఎస్పీ



బాధితులకు మొబైల్స్ అందజేస్తున్న ఎస్పీ



ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జనవరి 1 : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. గురువారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో జనవరి 1 నుండి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో 69 మంది బాల కార్మికులను గుర్తించామన్నారు. ఇందులో 7గురు బాలికలు కాగా 62 మంది బాలురున్నారన్నారు. తల్లిదండ్రులు తమ తాత్కాలిక ప్రయోజనాల కోసం పిల్లలను కార్మికులుగా పని చేయించి వారి భవిష్యత్తు నాశనం చేయరాదన్నారు. పిల్లలను బడిలో చేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలను బడికి పంపక పనికి పంపితే చట్టరీత్యా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. బాల కార్మికులుగా వెట్టిచాకిరి చేయిస్తూ గుర్తించినట్లయితే సంబంధిత పోలీసు అధికారులకు, 1098 నెంబర్, 100కు కాల్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆపరేషన్ స్మైల్ 10 బృందంలో పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించుకోవాలి

సీఈఐఆర్ పోర్టల్ ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల కోరారు. గురువారం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన మొబైల్ ఫోన్లను 63 మంది బాధితులకు పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఇప్పటివరకు ఈ పోర్టల్ ద్వారా 492 మందికి ఫోన్లు అందజేసినట్లు వివరించారు. మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఫోన్లు దొంగతనానికి గురైనా, పోయినా దుర్వినియోగమయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామీణ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ శైలేందర్, ఐటీ కోర్ ఎస్సై రవికుమార్, ఆర్ఎస్సై వినోద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలి

- ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్



చించాలలో పాఠశాల గదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



కుభీర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంరావుపాటిల్

ముథోల్, ఫిబ్రవరి 1 : విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ సూచించారు. ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విద్యుత్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. చిన్న చిన్న సమస్యలు, మరమ్మతులు వస్తే వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సమస్య వల్ల మిషన్ భగీరథకు ఇబ్బంది కలుగవద్దన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఏడీ ఏఈలు పాల్గొన్నారు.

పాఠశాలకు తగు సౌకర్యాలను కల్పిస్తాం

మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తగు సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం చించాల పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన గదులు వర్షాకాలం లో పైకప్పు నుండి వర్షం నీరు వస్తుందని, అలాగే ప్రహరీ గోడ కల్పించాలని, వర్కింగ్ అడ్జెస్ట్ కింద ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలకు వచ్చేలా చూడాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులకు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తప్పకుండా ముందుంటామన్నారు. ఈయన వెంట నాయకులు నర్సాగౌడ్, టి.రమేష్, కోరి పోతన్న, శివురాం, ఉపాధ్యాయులు రాజారెడ్డి, గంగాధర్, రాజశేఖరచారి, భోజబాయి, వనజ, పాఠశాల చైర్మన్ శంకర్, గ్రామస్తులు, తదితరులున్నారు.

అభ్యర్థిగెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

కుభీర్, ఫిబ్రవరి 1 : రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావుపాటిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివసాయి ఆలయ ప్రాంగణంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుకోసం ప్రతి కార్యకర్త గడగడపకు వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్రమోడి నేతృత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థి గెలుపుకోసం పాటు పడాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనన ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రతి కార్యకర్తకు రుణపడి ఉన్నారని వారికి అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్నం నాగేశ్వర్, వెంకట్‌రావుపాటిల్ గులాబ్ నాయక్, ఏశాల దత్తాత్రి కందూర్ కనకయ్య, ఎన్నిల నాగేందర్, తాలోడ్ శ్రీనివాస్, కమలేష్ రాథోడ్, కార్యకర్తలు తదితరులున్నారు.

దివ్యాంగ నిర్ధారణకు

స్లాట్‌బుక్ చేసుకోండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 1 : దివ్యాంగులకు సంబంధించిన నిర్ధారణ కోసం ఈ నెల 3 నుంచి మీ సేవలో ఔట్‌పేషెంట్ స్లిప్‌ల ద్వారా స్లాట్‌బుక్ చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో నిర్ధారించిన రోజుల్లో సదరం పరీక్షలు చేస్తారన్నారు. స్లాట్‌బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఉదయం 9 నుండి క్యాంపులో పరీక్ష చేయించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. సమీప పీహెచ్‌సీ వైద్యుల నుంచి ఓపీ స్లిప్‌తో స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు.

పదవీకాలం ముగిసిన సర్పంచ్‌ల

ఆత్మీయ సమ్మేళనం

సారంగాపూర్, ఫిబ్రవరి 1 : గ్రామ పంచాయతీల పదవీకాలం బుధవారం ముగియడంతో గ్రామ పంచాయతీలలో ఆత్మీ సమ్మేళనాన్ని నిర్వహించి సర్పంచ్‌లతో పాటు గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులను శాలువాతో సన్మానించి ఈ సందర్భంగా గ్రామాల ప్రజలు మాట్లాడారు. గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చేయడంతో సర్పంచ్‌లను అభినందించడంతో పాటు చేసినటువంటి అభివృద్ధి పనులను వెల్లడించారు.

నేటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన

మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో నేటి నుండి ప్రత్యేక అధికారుల పాలనను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో స్పెషల్ అధికారులు గ్రామ పంచాయతీలలో విధులను నిర్వహించడానికి సర్వం సిద్ధం చేసుకున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిక

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 1 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు బర్మ గంగాదాస్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.